క్లుప్తంగా

బాల ఆధార్‌తో సాంకేతిక సమస్యలకు చెక్



మాచర మట్టలులో బాల ఆధార్‌పై అవగాహన కల్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: పుట్టిన బిడ్డలకు ఆధార్ నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాల అమలు, బిడ్డల చదువులు తదితర అంశాల్లో సాంకేతిక సమస్యలకు చెక్ పెట్టవచ్చని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన ఆదేశాలపై సచివాలయ సిబ్బంది, సంబంధిత ఉద్యోగులు మండలంలోని 19 గ్రామాల్లో బాల ఆధార్ ప్రాధాన్యతపై ఇంటింటికీ వెళ్ళి అవగాహన కల్పిస్తున్నారు. తల్లిదండ్రులకు ఆధార్ నమోదు చేసుకునే పద్ధతిని వివరిస్తున్నారు. ప్రాధాన్యత క్రమంలో బాల ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నట్టు వారు తెలిపారు.

ప్రమాదాల నివారణకు యువత చొరవ



వంతెన వద్ద ఏర్పాటు చేసిన మెష్

కె.గంగవరం: కోట శివారు రాజువైరి వద్ద ఏటిగట్టు రహదారిలో వంతెన వద్ద ప్రమాదాల నివారణకు స్థానిక యువత చొరవ తీసుకున్నారు. అక్విడక్ట్ కమ్ అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ప్రమాదాలను నివారించాలని స్థానికులు, ప్రయాణికుల వినతులతో ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు మాత్రమే వేశారు. నెల రోజుల నుంచి నాలుగురు ప్రమాదకర మలుపు, వంతెన గమనించకపోవడంతో గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. ప్రమాదాలను ఎలాగైనా నివారించాలనే ఉద్దేశంలో కోట గ్రామ యువజన సంఘం సభ్యులు చొరవ తీసుకుని వంతెనకు ఇరువైపులా కొంత దూరం ఇనుప స్తంభాలు వేసి దానికి అనుసంధానంగా మెష్‌ను ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణకు శాశ్వతంగా మెష్ ఏర్పాటు చేసిన కోట యువతను ప్రయాణికులు, స్థానికులు అభినందించారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

కాజులూరు: మండలంలో అర్హులైన కౌలు రైతులంతా సీసీఆర్‌సీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని మండల రెవెన్యూ అధికారి వై.వేగేశ్వర రావు అన్నారు. సోమవారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ భూ యజమానికి ఎటువంటి నష్టం కలగకుండా కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ సీసీఆర్‌సీ కార్డులు పొందటం ద్వారా పంటలు నమోదు చేయించుకుని ధాన్యాన్ని సులభతరంగా విక్రయించుకోవటంతో పాటు బ్యాంకుల నుంచి పంట రుణాలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పొందవచ్చన్నారు. అర్హులైన రైతులు ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, సాగు చేస్తున్న పొలం పట్టదారు పాసుపుస్తకం జిరాక్సులు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, పూర్తి చేసిన దరఖాస్తు ఫారం వీఆర్వోలకు అందజేసి కౌలురైతు కార్డులు పొందవచ్చన్నారు.

విద్యా రంగానికి పెద్దపీట



తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి అన్నారు. సత్యవాడ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సోమవారం వారు చేశారు. నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలకు రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 13 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు ఎంపీపీ, జెడ్పీటీసీ పూజ చేశారు. విద్యా కమిటీ చైర్మన్ ఎస్.సత్యనారాయణ, హెచ్‌ఎం వి.రాజశేఖర్, నాయకులు పంపన సుబ్బారావు, ఓబులనేని రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో పనుల్లో జాప్యంతో లబ్ధిదారుల ఇక్కట్లు

మండపేట: టిడ్కో పనుల్లో జరుగుతున్న జాప్యంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావు అన్నారు. స్థానిక టిడ్కో అపార్ట్‌మెంట్లను సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ల సందర్శించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఊరగాయ... ధర దిగదాయే

- ఘాటెక్కుతున్న ముడిసరకుల ధర
- వేసవి ముగుస్తున్నా ఊపందుకోని పచ్చళ్ల తయారీ
- రెట్టింపు ధర పలుకుతున్న ఆవకాయ కారం



ఆవకాయ పచ్చడి

కపిలేశ్వరపురం: భోజనం చేసే కంచంలో ఎన్ని రకాల పదార్థాలను వడ్డించినా పచ్చడి అంటే పడిచచ్చే ప్రాణాలు అనేకం. రోజువారీగా తీసుకునే ఆహారంలో ఒకసారైనా పచ్చడిని నాలుకకు అంటించని రోజంటూ ఉండదంటే అతిశయోక్తి కాదు. అంతటి ప్రత్యేకత గల పచ్చళ్ల తయారీ కాలం వేసవి. వేసవిలో రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల ప్రజలు ఏడాదికి సరిపడా ఊరగాయ పచ్చళ్లను తయారు చేసి నిల్వ ఉంచుకోవడంతో పాటు దూర ప్రాంతాల్లోని పిల్లలకు, బంధువులకు వాటిని పంపిస్తుంటారు. మార్కెట్లో రకరకాల కంపెనీల పచ్చళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ తయారు చేసుకున్న పచ్చళ్లనే ఇష్టపడతారు. అయితే వేసవి చివరి దశకు వచ్చేసినా సరుకుల ధరలు పెరగడంతో పచ్చళ్ల తయారీ సందడి గ్రామాల్లో అంతంతమాత్రంగానే ఉంది.

ప్రభావితం చేసిన ప్రకృతి వైపరీత్యం

రాష్ట్రంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పచ్చళ్ల తయారీకి వినియోగించే మామిడి, మిరపకాయలు, మెంతులు, ఆవాలు, వెల్లుల్లి పంటల దిగుబడి అంతంత మాత్రంగా మిగిలింది. మరోపక్క వేరుశనగ, గానుగ నూనెల కొరత నేపథ్యంలో ధరలు పెరిగాయి. కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లోని లంక గ్రామాల్లో మామిడి తోటలున్నాయి. అవిభక్త జిల్లాలో మామిడి దిగుబడి తగ్గడంతో వాటి ధరలు పెరిగాయి. 15,897 హెక్టార్లలో మామిడి సాగవుతుండగా వాటి ద్వారా సుమారు 1,93,472 మెట్రిక్ టన్నుల మామిడి కాయల దిగుబడి వస్తుందని అంచనా. ఈదురు గాలులకు మామిడి నేలమట్టమైంది. నాణ్యమైన కాయల కొరత కారణంగా ధర పెరిగింది.

పెరిగిన ధరలు

మామిడి రకాల్లో 100 కాయలు ధర వివిధ స్థాయిల్లో పలుకుతున్నాయి. కొత్తపల్లి కొబ్బరి మామిడి గతేడాది రూ.1000 కాగా ఈ ఏడాది రూ.1500కి పెరిగింది. సువర్ణరేఖ దేశవాళీ రకం రూ.600 నుంచి 1000కి, చెరుకు రసాలు రూ.300 నుంచి రూ.800, మాగాయి పచ్చడికి వాడే పెద్దరసాలు రూ.500 నుంచి రూ.1000కి పెరగ్గా, చిన్న రసాలు రూ.900 ధర పలుకుతోంది. దేశవ్యాప్తంగా తలెత్తిన పరిణామాల నేపథ్యంలో ఇతర సరుకుల ధరలూ పెరిగాయి. ఆవకాయి ఎండుమిర్చి కిలో రూ.250 నుంచి 650కి పెరిగింది. తర్వాత కొంతమేర తగ్గింది. నువ్వులనూనె గతేడాది కిలో రూ.320 కాగా ప్రస్తుతం 400 ధర పలుకుతోంది. వేరు శనగనూనె రూ.140 నుంచి రూ.190, వెల్లుల్లి రూ.80 నుంచి రూ.120, ఆవాలు రూ.150 నుంచి రూ.200, మెంతులు రూ.90 నుంచి 120కి పెరిగాయి.

తగ్గుతున్న పచ్చళ్ల వాడకం

బీపీ ఉన్నవారు ఉప్పుకారాలను, షుగరు ఉన్నవారు కార్బొహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే అన్నాన్ని తగ్గించి తినాలన్న వైద్యుల సూచనలకు ప్రాముఖ్యత పెరిగింది. నూనె, ఉప్పు, కారం దండిగా వాడే పచ్చళ్ల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్న కారణంగా వాటి వినియోగమూ తగ్గుతూ వస్తోంది. నిల్వ పచ్చళ్ల స్థానంలో ఎప్పటికప్పుడు తయారు చేసుకునే రోటి పచ్చళ్లను ఉప్పు తగ్గించుకుని వాడుతున్నారు. మరోపక్క తినతగువారు మార్కెట్‌లో బాటిళ్ళు, ప్యాకెట్ల రూపంలో సిద్ధంగా ఉన్న పచ్చళ్ళను వినియోగిస్తున్నారు.

> **ఎండు మిర్చి రేటు రెట్టింపు**
>
> 
>
> ఎండుమర్చి రేటు గత సీజన్‌తో పోలిస్తే రెట్టింపు ధర పలుకుతోంది. దానికి తోడు వాతావరణ పరిస్థితులు కారణంగా మామిడి, ఇతర సరుకుల దిగుబడి తీవ్రంగా ప్రభావితమైంది. దుకాణాల్లో రెడీమేడ్ పచ్చళ్ల కొనుగోలు పెరిగింది.
>
> – యానాల సుబ్బారావు, డెయిరీ మిల్క్ వ్యాపారి, అంగర

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు



ఏడిదలో మహిళలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో గడప గడపకూ..

మండపేట: ప్రతీ పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అందుకోసం ఆయన ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు నేడు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏడిద గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులతో కలిసి సోమవారం ఆ గ్రామంలోని పంచాయతీ ఏరియా, సావరం రోడ్డులో ఎమ్మెల్సీ తోట పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాల వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ అందుకు సంబంధించిన బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను అక్కడికక్కడే సూపరింటెండెంట్ ప్రసాద్, ఈఓ వుండమట్ల వీర్రాజులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందన్నారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిసెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, వై. సీతానగరం ఉప సర్పంచ్ వరదా చక్రవర్తి, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రామకృష్ణ, ఎంపిటీసీ సభ్యుడు పట్నాల నాగబాబు, జేసీఎస్ కన్వీనర్ బందెల సాయిరాం, పార్టీ నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, తాతపూడి రాజేష్, పమిడిపల్లి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనను మెచ్చి పార్టీలో చేరా..

అన్ని వర్గాలకూ అండగా నిలిచే నేత ఎమ్మెల్సీ తోట: ఓగిరాల దేవి



ఓగిరాల దేవి

మండపేట: కులమతవర్గాలు, రాజకీయాలు చూడకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలన, ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విధానాలకు ఆకర్షితురాలై తాను వైఎస్సార్ సీపీలో చేరానని పట్టణ ప్రముఖుడు స్వర్గీయ ఓగిరాల బ్రహ్మాజీ సతీమణి దేవి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తాను పార్టీలో చేరాక కమ్మ సామాజిక వర్గానికి చెందిన నువ్వు ఎమ్మెల్సీ తోట వెంట వెళ్లడం ఏమిటని కొందరు ఫోన్లు చేసి ప్రశ్నిస్తున్నారన్నారు. రాజకీయాల పట్ల ఆసక్తి ఉంటే ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు మద్దతుగా నిలబడాలి కదా అని సూచిస్తున్నారన్నారు. వారందరికీ సమాధానం ఇచ్చేందుకు మీడియా ముందుకు వచ్చానని దేవి తెలిపారు. కమ్మ సామాజికవర్గానికి ఎమ్మెల్యే వేగుళ్ల చేసిందేమీ లేదన్నారు. తన భర్త బ్రహ్మాజీ మరణంతో తాము కష్టాల్లో ఉంటే ఎమ్మెల్యే వేగుళ్ల పట్టించుకోలేదన్నారు. ఆపద సమయంలో తమ కుటుంబానికి రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అండగా నిలిచారన్నారు. టీడీపీ జెండా మోసిన ఎంపీఎస్ ఫౌండర్ శ్రీరామ్ ఆకస్మాత్తుగా చనిపోయి ఆస్తి తగాదాల్లో ఆయన కుటుంబానికి అన్యాయం జరుగుతుంటే ఎమ్మెల్యే వేగుళ్ల ఏం న్యాయం చేశారని ప్రశ్నించారు. ఎంతో మంది కమ్మ సామాజిక వర్గీయులు తమకు న్యాయం కోసం ఎమ్మెల్సీ తోటను ఆశ్రయిస్తున్నారన్నారు. కష్టమని వస్తే ఏ వర్గం, ఏ పార్టీ అని చూడకుండా అండగా నిలబడే వ్యక్తి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులని, అందుకే ఆయన వెంట వెళ్లామన్నారు. ఊపిరున్నంత కాలం వైఎస్సార్ సీపీ లోనే ఉంటామని, స్వార్థ రాజకీయాలు చేసే ఎమ్మెల్యే వేగుళ్ల పంచన చేరేది లేదని ఓగిరాల దేవి పేర్కొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అత్యవసరం

జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ శ్రీధర్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ తదితరులు

అమలాపురం టౌన్: ఎన్నడూ లేని విధంగా వేసవిలో ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎక్కడికక్కడ చలి వేంద్రాల ఏర్పాటు అత్యవసరమని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు డీఎస్పీ కార్యాలయం వద్ద అమలాపురం వాకర్స్ క్లబ్, జిల్లా పోలీసు శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌తో కలిసి ఎస్పీ శ్రీధర్ సోమవారం ఉదయం ప్రారంభించారు. తొలి రోజు చలివేంద్రానికి మజ్జిగ సమకూర్చిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్‌ను ఎస్పీ శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, ఛాంబర్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్తిబాబు, పంచాయతీ రాజ్ డీఈఈ అన్యం రాంబాబు, పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి, ఎస్పీ కార్యాలయ ఎస్బీ సీఐ కోలా రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాత్విక్‌కు సత్కారం



సాత్విక్, అతని తల్లిదండ్రులను సత్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నానిరాజు తదితరులు

అమలాపురం టౌన్: దుబాయ్‌లో జరిగిన ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతాకాన్ని సాధించి దేశానికి ఎనలేని కీర్తిని తెచ్చిన అంతర్జాతీయ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజు కోనసీమ జిల్లాకే గర్వకారణమని మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలో సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో సాత్విక్‌కు అభినందన సభ సోమవారం నిర్వహించారు. ఈ సత్కార సభలో సాత్విక్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు రంకిరెడ్డి కాశీ, రంగమణిలను సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, సీవీ రామన్ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, లయన్స్ అధ్యక్షుడు జంపన సునీల్ వర్మ తదితరులు సాత్విక్ క్రీడా ప్రతిభను అభినందించారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఆత్రేయపురం: ర్యాలిలో 45 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం ఉదయం 8.48 గంటలకు జరిగింది. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో వివిధ పూజ లు, హోమాలు నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్యే, ప్రభు త్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, టీడీపీ నాయకులు బండారు సంజీవ్‌తో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నా రు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆల య ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు.

ర్యాలీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పాల్గొని రూ.50 వేల విరాళం ఇచ్చారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీస్వామి సన్నిధిలో నిత్యాన్నదానానికి చింతనలంకకు చెందిన విళ్ల మణికంఠ, జ్యోతి దంపతులు రూ.50 వేలు విరాళంగా సమర్పించారు. తమ కుమారుడు దర్శిత్‌రన్‌వేద్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏడాది అక్టోబర్ 19న అన్నదానం చేయాలని విరాళం ఇచ్చారు. దాత కుటుంబ సభ్యులకు ఉప ప్రధానార్చకులు మద్దాలి తిరుమలశింగరాచార్యులు స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆర్పీలు అవగాహన పెంచుకోవాలి



శిక్షణకు హాజరైన రామచంద్రపురం మున్సిపాలిటీ మెప్మాలోని ఆర్పీలు

సామర్లకోట: మెప్మా రీసోర్సు పర్సన్లు శిక్షణలో ఇచ్చే అంశాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా రీసోర్సు పర్సన్ రాజశేఖర్ అన్నారు. కాకినాడ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలో మెప్మా రీసోర్సు పర్సన్లకు ఇస్తున్న శిక్షణలో భాగంగా సోమవారం రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్పీలకు రెండు రోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు. మెప్మా పరిధిలోని ఆర్పీలు తమ విధులను వేగంగా, సక్రమంగా నిర్వహించి ఆన్‌లైన్‌లో సమాచారం పొందు పర్చడానికి శిక్షణ దోహదపడుతుందన్నారు. మెప్మా కార్యకలాపాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలపై శిక్షణ నిర్వహించారు. రామచంద్రపురం మెప్మా సీఎంఎం, సీఓలు పాల్గొన్నారు. మంగళవారం వీరి శిక్షణ ముగుస్తుంది. బుధవారం నుంచి కాకినాడ కార్పొరేషన్‌లోని ఆర్పీలకు శిక్షణ ఉంటుందని డీఆర్పీ రాజశేఖర్ తెలిపారు.

సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక



సాఫ్ట్‌బాల్ టీమ్‌కు ఎంపికైన బాలికలు

ఐ.పోలవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలుర, బాలికల టీమ్ ఎంపిక ముగింపు కార్యక్రమం ఐ.పోలవరం కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగింది. ఈ నెల 12 నుంచి 22 వరకూ జరిగిన కార్యక్రమంలో 16 మంది బాలురు, 16 మంది బాలికలను ఎంపికచేశారు. వారంతా ఈ నెల 26 నుంచి 28 వరకూ కడప జిల్లా రాయచోటిలో జరిగే స్టేట్ మీట్‌లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి ఏఎస్ రాంప్రసాద్ తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఎంపికైన క్రీడాకారులకు సినీ నిర్మాత రాయపురెడ్డి రాజా ఆర్థిక సాయంతో స్పోర్ట్స్ కిట్లను ఎంఈఓ ఎం.వెంకటేశ్వరావు, ఐ.పోలవరం హెచ్‌ఎం వి.సురేష్ బాబులు అందజేశారు. క్రీడాకారులకు వసతి, భోజనం, ప్రయాణ ఖర్చుల కోసం స్థానిక సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరావు, సాగిరాజు శ్రీను ఆర్థిక సాయం చేశారు.

దైవ స్మరణతో ధన్యులం అవుదాం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- పులిదిండిలో వేణుగోపాలస్వామి ఆలయానికి శంకుస్థాపన



ఆలయానికి శంకుస్థాపన పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, లావణ్య దంపతులు

ఆత్రేయపురం: ప్రతి ఒక్కరూ దైవస్మరణతో ధన్యులు కావాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం పులిదిండిలో వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవం కనుల పండువగా జరిగింది. దీనికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి–లావణ్య దంపతులు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, సూర్యసుందర సీతాకుమారి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుడు పెనుగొండకు చెందిన ఖండవల్లి సూర్యనారాయణ ఆచార్యులు (రమణబాబు) ఆధ్వర్యంలో పూజా క్రతువులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఆలయం జీర్ణావస్థకు చేరడంతో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజుతో పాటు గ్రామస్తులు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. గ్రామస్తులు మరో రూ.25 లక్షలు ప్రభుత్వానికి జమ చేశారన్నారు. మరిన్ని విరాళాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు సమర్పించిన దాతలను అభినందించారు. దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబా, నాయకులు రాయి వెంకటేశ్వరరావు, పాల నాగేశ్వరరావు, కొల్లి శ్యామ్‌సన్, వాడపల్లి దేవస్థానం చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓలు ముదునూరి సత్యనారాయణరాజు, కృష్ణ చైతన్య పాల్గొన్నారు. పులిదిండి గ్రామంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

బీసీలకు ప్రభుత్వం ప్రాధాన్యం: మంత్రి వేణు



బీసీ నేత భరత్‌భూషణ్ తదితరులతో సమావేశమైన మంత్రి వేణు

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం బీసీ నేత భరత్‌భూషణ్‌తో మంత్రి వేణు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తుందన్నారు. శెట్టిబలిజ సంఘీయులకు ప్రభుత్వం అమలు చేస్తున్న అంశాలు, వారి అభివృద్ధికి ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోవాలో తగు నివేదికను ఇవ్వాలన్నారు. మంత్రి ఆదేశాల మేరకు త్వరలోనే నివేదిక అందిస్తామని భరత్‌భూషణ్ తెలిపారు.

25న విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక

మండపేట: మండపేట సబ్ డివిజన్ కార్యాలయంలో ఈనెల 25న విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు విద్యుత్తు శాఖ రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర వర్మ తెలిపారు. గురువారం ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు జరిగే ఈ వేదిక సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, విశ్రాంతి న్యాయమూర్తి బి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు శ్రీనివాస్, సురేష్‌కుమార్ తదితరులు హాజరవుతారన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చు తగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లులో పేరు మార్పు, సరఫరా పునరుద్ధరణ ఇబ్బందులు, నియంత్రణ మార్పిడి తదితర సమస్యలను వినియోగదారులు కమిటీకి లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చునన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ శ్రీధరవర్మ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

మంత్రి వేణు పరామర్శ



తోటపేటలో వార్డు సభ్యుడు శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: తోటపేట గ్రామంలో వార్డు సభ్యుడు, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ అల్లం వెంకటరమణ (శ్రీను) ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, అతని కుటుంబాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సోమవారం పరామర్శించారు. మృతుని భార్య అల్లం దేవీదుర్గ, కుమార్తె వీరలక్ష్మి, కుమారుడు వెంకట దుర్గారావులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అదే గ్రామానికి చెందిన ఆళ్ల రాజ్యలక్ష్మి (81) మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దామిశెట్టి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

కాజులూరు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులకు జనసేన నాయకులు సాయం అందజేశారు. కోలంకకు చెందిన బత్తుల నరేష్, కుయ్యేరుకు చెందిన తాతపూడి బాబూరావు, శీలకు చెందిన మంగపల్లి అబ్రహం, చేదువాడకు చెందిన చల్లా శేషమ్మ, ఆంజనేయులు, గొల్లపాలేనికి చెందిన కావూరి రాంబాబు, మతుకుమిల్లికి చెందిన లంక పుల్లారావుల కుటుంబ సభ్యులకు నిత్యావసరాలు అందించారు. పార్టీ నియోజక ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు బొండా వెంకన్న తదితరులు పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ ట్రస్టు ద్వారా వీటిని పంపిణీ చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

రావులపాలెం: మండలంలోని గోపాలపురం సెంటర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం .. తణుకు వైపు నుంచి వస్తున్న కారు స్థానిక గోపాలపురం జంక్షన్ వద్ద బైక్‌పై రోడ్డు దాటుతున్న పొడగట్లపల్లికి చెందిన జె.దుర్గాప్రసాద్‌ను ఢీకొంది. వెంటనే పక్కనున్న డివైడర్‌ను ఢీకొట్టడంతో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్‌తో పాటు కారు ప్రయాణిస్తున్న రంగంపేటకు చెందిన బి.సూర్యకుమారి, రాజు, కె.మంగా, శ్రీనివాసరావు, డ్రైవర్ ఎ.సత్యనారాయణకు గాయాలయ్యాయి. క్షతగ్రాతులను కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటరమణ వివరించారు.